క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 22వ తేదీ ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు రేపల్లె పట్టణ, మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిజాంపట్నంలో...

నిజాంపట్నం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ కళ్యాణ్ తెలిపారు. శనివారం నిజాంపట్నంలోని విద్యాశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రేపల్లెలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మమ్మతుల కారణంగా నిజాంపట్నం మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తక్కువ కాలపరిమితి గల వరి వంగడాలను వేయాలి

బాపట్ల వ్యవసాయ శాఖ డీడీఏ విజయనిర్మల

అద్దేపల్లి(భట్టిప్రోలు): అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులు తక్కువ కాల పరిమితి వరి వంగడాలను వేసుకోవాలని బాపట్ల వ్యవసాయ శాఖ డీడీఏ విజయనిర్మల పేర్కొన్నారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో రైతులతో వ్యవసాయ శాఖాధికారులు శనివారం ఆర్ఎస్‌కే లెవెల్ ఫార్మర్స్ ట్రెనింగ్ ఆన్ గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టిస్ ఇన్ డిఫరెంట్ క్రాప్స్ -2024-2025 కార్యక్రమం మండల వ్యవసాయాధికారి జి.మీరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ ఎస్ఎల్ఆర్ 34449, ఎంటీయూ రకాలు, రెండవ పంటగా మినుము, పెసర సాగుచేసుకోవాలని సూచించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మురళీధర్, వరి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణవేణి, బాపట్ల, రేపల్లె ఏడీఏలు సయ్యద్ అక్తర్ హుస్సేన్, విజయబాబు, ఎంపీఈఓ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మెరుగైన పాలన



కర్లపాలెం: రాష్ట్రంలో సంక్షోభంలోనూ మెరుగైన పాలన జరుగుతుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. శనివారం కర్లపాలెం గ్రామ సచివాలయం వద్ద జరిగిన ఇది మంచి ప్రభుత్వం ఎందుకంటే.. సభకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు పి.వేణుగోపాల్‌రెడ్డి డీపీఓ రవికుమార్, ఆర్‌డీవో రవీందర్, తహసీల్దార్ వెంకటరత్నం, ఎంపీడీవో ఎలీషాబాబు, నాయకులు భూపతిరావు, వెంకటస్వామి, పఠాన్, బాజీ తదితరులు ఉన్నారు.

అర్చకుల కుటుంబాలకు ఆసరా



కొల్లూరు: వరద బాధిత అర్చకుల కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేసి స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆసరాగా నిలిచారు. శనివారం మండలంలోని కిష్కిందపాలెం, పెసర్లంక, చింతర్లంక, సుగ్గునలంక, పోతార్లంక గ్రామాలలోని వైఖానస అర్చక కుటుంబాలకు రాష్ట్ర వైఖానస యూత్ ఫోరం, ధన్వంతరి ట్రస్ట్, తెనాలి శ్రీ వైఖానస సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 100 కుటుంబాలకు నిత్యావసర సరకులు, వస్త్రాలు, మెడికల్ కిట్ల్ అందజేసినట్లు సంస్థల ప్రతినిధులు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు దీవి జయదేవ్, డాక్టర్ అగ్నిహోత్రం, మేడూరు శ్రీనివాసమూర్తి, మాధవకుమార్, తమిరిశ రఘు, దీవి యోగానంద్ చక్రవర్తి పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రేతలు అరెస్ట్

135 క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం

నగరం: అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ భార్గవ్ చెప్పారు. మండలంలోని నగరం, ఈదుపల్లి గ్రామాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణాల్లో శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నగరం, ఈదుపల్లి గ్రామాలలో చేసిన తనిఖీలలో 135 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రామకృష్ణ, లక్ష్మయ్య, వెంట్రామయ్యలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా మద్యం విక్రయాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాలలో ఎక్కడైనా అక్రమ మద్యం విక్రయాలు జరిగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



అండర్-17 కబడ్డీలో విజేతలుగా నిలిచిన జంపని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు



అమర్తలూరు జెడ్పీ స్కూల్‌లో క్రీడలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ రమేష్, హెచ్‌ఎం నిరీక్షణరావు

- ఎస్‌జీఎఫ్ బాల బాలికల క్రీడా పోటీలు ప్రారంభం
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

జంపని(వేమూరు): జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ అండర్-14,17 బాల బాలికల పోటీలు నిర్వహించడం జరిగిందని పాఠశాల హెచ్‌ఎం నరసింహస్వామి తెలిపారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-17 విభాగంలో జంపని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బాలురు విజేతలుగా నిలిచారన్నారు. అండర్-14 పోటీల్లో పాఠశాల బాలికలు రన్నరప్ సాధించారన్నారు. అండర్-14 పోటీల్లో పాఠశాలకు చెందిన బాలురు రన్నరప్ సాధించారని, పెరవలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలుర జట్టు ఈ విభాగంలో విజేతలుగా నిలిచారన్నారు. పెరవలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలురు అండర్-17 విభాగంలో రన్నరప్ సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ విద్యా కమిటీ చైర్మన్ వేల్పూల విజయబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.రవి రాజు, టి.బుచ్చి రెడ్డి, వి.శ్రీనివాసరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమర్తలూరులో...

అమర్తలూరు(వేమూరు): క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని మండల విద్యాశాఖాధికారి కనపాల రమేష్ అన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రభుత్వం పాఠశాలల్లో క్రీడలు నిర్వహించి, విద్యార్థుల్లో ఆసక్తి పెంచుతుందన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల హెచ్‌ఎం కనపర్తి నిరీక్షణరావు, వ్యాయమ ఉపాధ్యాయులు సాంబశివరావు, శ్యాంబాబు పాల్గొన్నారు.

ఆటల పోటీలపై సమీక్ష..

భట్టిప్రోలు: బాపట్ల ఎస్‌జీఎఫ్ఏ ఆదేశానుసారం మండల స్థాయిలో ఈనెల 23, 24వ తేదీలలో అండర్-17,14 బాల బాలికలకు నిర్వహించనున్న ఆటల పోటీలకు సంబంధించి మండల విద్యాశాఖాధికారి నీలం దేవరాజు అధ్యక్షతన శనివారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో ఆయా హైస్కూళ్ల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ దేవరాజు మాట్లాడుతూ 23న బాలికలకు, 24న బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, వ్యక్తిగత క్రీడాంశాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. హెచ్‌ఎం సి.రామకోటేశ్వరరావు, మండల కో-ఆర్డినేటర్ చేబ్రోలు శ్రీనివాసరావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

నష్ట పరిహారం, విత్తనాల పంపిణీ ఊసేది?



భట్టిప్రోలులో నీటమునిగిన పంట పొలాలను పరిశీలించిన ఎంపీపీ లలిత కుమారి, పక్కన ప్రజా ప్రతినిధులు, రైతులు

ఎంపీపీ లలిత కుమారి

భట్టిప్రోలు: ఇటీవల కురిసిన అధికవర్షాల కారణంగా ఖరీఫ్‌లో వరి కృష్ణా నదీ పరివాహక లంక గ్రామాల్లో వాణిజ్య పంటలు పూర్తిగా నీట మునిగి ఎందుకూ పనికిరాకుండా పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. శనివారం భట్టిప్రోలులో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అధిక వర్షాల కారణంగా వరదలు వచ్చి 20 రోజులు గడుస్తున్నా నేటివరకు కూటమి ప్రభుత్వం నష్టపరిహారం, విత్తనాల పంపిణీపై నోరు మెదపకపోవడంపై శోచనీయమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతుభరోసా, కౌలురైతు కార్డులు, ఈ క్రాప్, సబ్సిడీపై విత్తనాలు అందించడమే కాక.. వర్షాభావానికి గురైతే 15 రోజుల్లోపే పంటనష్ట పరిహారం, విత్తనాలు అందించడం జరిగిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇవేమి పట్టనట్లు వ్యవహరించడం విచారకరమన్నారు. ఆమె వెంట ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, రైతులు వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, కుక్కల భూషణరావు, పసుపులేటి శివరామప్రసాద్, దావూరి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి గురజాడ అప్పారావు

భట్టిప్రోలు: తెలుగుభాష మహాకవి గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో శనివారం గురజాడ అప్పారావు 162వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మండల విద్యాశాఖాధికారి నీలం దేవరాజు నూలు దండలు వేశారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ సమాజాన్ని ఆలోచింపచేసిన మహోన్నత వ్యక్తి గురజాడ అడుగజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. దేశమంటే మనుషులోయ్ అంటూ నినాదాలు చేశారు. గురజాడ బాటలో భావితరాలు అనుసరించి మార్గదర్శకులు కావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సి.రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గురజాడ చిత్రపటానికి నూలు దండలు వేస్తున్న ఎంఈఓ దేవరాజు, హెచ్‌ఎం రామకోటేశ్వరరావు

విధుల భారం నుంచి విముక్తి కల్పించండి

కొల్లూరు: వైద్య, ఆరోగ్య విధులతోపాటు ప్రభుత్వం అదనంగా అప్పగించిన విధుల భారం నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ సచివాలయ ఏఎన్ఎంలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి వి.కావ్యకు వినతిపత్రం అందజేశారు. శనివారం పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయ ఏఎన్ఎంలు తాము ప్రభుత్వం అదనంగా అప్పగించిన విధుల కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వైద్యురాలి వద్ద మొరపెట్టుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం తమ సమస్యల పరిష్కారం కోసం విధులకు దూరంగా ఉంటూ తమ నిరసనను వ్యక్తం చేస్తున్నట్లు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వైద్య, ఆరోగ్య శాఖ విధులైన కాలానుగుణ వ్యాధులు, వ్యాక్సిన్ పాఠశాలల జేఎఫ్ఏ, ఫీవర్ సర్వే, ఏఎంబీ, ఏఎన్‌సీ, పీఎన్‌సీ విజిట్స్, ఆర్‌సీహెచ్ వర్క్ వంటివి నిర్దిష్ట సమయాలలో పూర్తి చేస్తున్నామన్నారు. ఇటీవల నుంచి ప్రభుత్వం పెన్షన్ల పంపిణీ, హౌస్ టు హౌస్ పల్స్ సర్వే, హౌస్ టు హౌస్ మ్యాపింగ్ వంటి అదనపు బాధ్యతలు అప్పగించడంతో పనిభారం పెరుగుతుందని వాపోయారు. వీటికి తోడు హాజరు విషయంలో శివారు ప్రాంతాలున్న సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదనను వెళ్లబుచ్చారు. సచివాలయ ఏఎన్ఎంలు అందజేసిన వినతి పత్రంలో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఈసందర్భంగా వైద్యాధికారిణి కావ్య వెల్లడించారు.



కొల్లూరు పీహెచ్‌సీ వైద్యురాలికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఏఎన్ఎంలు

పోషకాహార పదార్థాల ప్రదర్శన

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పల్లెకోన సెక్టార్ పరిధిలో పోషకాహార మాసోత్సవాలు పురస్కరించుకుని శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఫజురున్నీసా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో సమకూరే ఆకు కూరలు తోటకూర, గోంగూర, తీసుకోవాలని సూచించారు. అలాగే వీటితో పాటు బీట్ రూట్, క్యారెట్, బెల్లం తీసుకోవాలన్నారు. బాలామృతంతో కేకులు తయారు చేసేకునేవిధంగా మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు అంగన్‌వాడీలు కృషి చేయాలని కార్యక్రమంలో పల్లెకోన అంగన్‌వాడీ సెక్టార్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



పోషకాహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎంపీపీ లలిత కుమారి, సూపర్‌వైజర్ ఫజురున్నీసా

బాధితులకు స్వచ్ఛంద సంస్థల చేయూత

పెసర్లంక(భట్టిప్రోలు): కృష్ణానది పరీవాహక లంక గ్రామాల్లో వరద బాధితులను ఆదుకునేందుకు ఈరే మినిస్ట్రీస్ ముందుకు వచ్చింది. శనివారం భట్టిప్రోలు మండలం పెసర్లంక గ్రామంలో 150 కుటుంబాలకు దుస్తులు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మినిస్ట్రీస్ డైరెక్టర్ కె.సుదీర్ మాట్లాడుతూ ఇటీవల కొల్లూరు మండలం తిప్పలకట్టలో 450, భట్టిప్రోలు మండలం పెదలంకలో 250 కుటుంబాలకు ఆపన్నహస్తం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్ పి.ప్రకాష్, ఈరే మినిస్ట్రీస్ బృందం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చింతమోటులో...

భట్టిప్రోలు మండలం చింతమోటు గ్రామంలో శనివారం 300 వరద బాధిత కుటుంబాలకు ప్రకాశం జిల్లా వేటపాలెం మండల సమాఖ్య, వీవోఏల ఆధ్వర్యంలో కర్లపాలెం సీసీ, గ్రామవాసి శొంటి పూర్ణ చంద్రరరావు చొరవతో దుస్తుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేటపాలెం ఏపీఎం శ్రీనివాసులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శొంటి సుబ్బారావు, ఉప సర్పంచ్ శొంటి రామకృష్ణ, స్థానిక పెద్దలు కారంకి వెంకయ్య, శొంటి నానీ, లుక్కా బాలయ్య, బొర్రా రమణయ్య పాల్గొన్నారు.



పెసర్లంకలో దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఈరే మినిస్ట్రీస్ డైరెక్టర్ సుధీర్

కళాశాల అభివృద్ధికి నాదెళ్ల సేవలు ఎనలేనివి

నగరం: స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాల అభివృద్ధికి డాక్టర్ నాదెళ్ల వెంకటకృష్ణారావు చేసిన సేవలు ఎనలేనవని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి చెప్పారు. కళాశాలలో శనివారం వెంకటకృష్ణారావు సంసర్మణ సభ నిర్వహించారు. ఈసందర్భంగా బుచ్చియ్యచౌదరి మాట్లాడుతూ కళాశాల వ్యవస్థాపక సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా నాదెళ్ల వెంకటకృష్ణారావు పనిచేశారన్నారు. తీరప్రాంత ప్రజలకు ఉన్నత విద్యను అందించాలనే సదుద్దేశంతో కళాశాల స్థాపనకు కృషి చేశారన్నారు. కళాశాల అభివృద్ధికి కృష్ణారావు చేసిన కృషి మరువలేదని కొనియాడారు. తొలుత ఆయన విగ్రహనికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత అధ్యాపకుడు పి.జయశీలరావు, వీరబాబు, రాజారాంలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటనారయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెదపులివర్రు(భట్టిప్రోలు): పల్లె ప్రాంతాలలో విద్య సౌరభాలను పూయించి గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభ్యున్నతికి తన వంతు సేవలందించడమే కాక ప్రజా వైద్యుడిగా అన్నివర్గాల ఆదరాభిమానాలను చూరగొన్న దివంగత డాక్టర్ నాదెళ్ల వెంకట కృష్ణారావు చిరస్మరణీయులని పలువురు వక్తలు పేర్కొన్నారు. వెంకట కృష్ణారావు 29వ వర్ధంతి పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం పెదపులివర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆయన విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కొమ్మినేని శ్రీమన్నారాయణ, ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం వి.సుబ్బారావు, ఉపాధ్యాయులు కొండలరావు, పర్రె రవి, రామయ్య, సాంబయ్య, మహేష్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుచ్చియ్య చౌదరి, వేదికపై ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణ పనుల పరిశీలన

అమర్తలూరు(వేమూరు): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయడం జరుగుతుందని సమగ్ర శిక్షా అభియాన్ అసిస్టెంట్ ఇంజినీరు పవన్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా రూ.15 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు రూ 5లక్షలతో శ్లాబ్ దశవరకు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. మూడో విడత నిధులు వచ్చిన వెంటనే కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. పాఠశాల అబివృద్ధి కోసం రూ.5 లక్షల నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణం త్వరగా పూర్తి చేస్తామన్నారు. పాఠశాల హెచ్‌ఎం కనపర్తి నిరీక్షణరావు పాల్గొన్నారు.



జెడ్పీ పాఠశాలలో కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఏఈ పవన్ కుమార్, హెచ్‌ఎం

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టర్ డీడీ స్మిత్

బాపట్ల: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామని డాక్టరు ఎన్జీ రంగా వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టరు డీడీ స్మిత్ పేర్కొన్నారు. కళాశాల దత్తత గ్రామమైన కావూరివారిపాలెంలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా డాక్టర్ డీడీ స్మిత్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడటం వలన నేల, నీరు,గాలి కాలుష్యానికి గురవుతుందని చెప్పారు. గ్రామంలో చెత్తచెదారం ఎక్కడపడితే అక్కడ వేయరాదని సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ డి.విజయ్‌కుమార్, కళాశాల బోధన సిబ్బంది డాక్టర్ కె.కృపావతి, డాక్టర్ ఎస్.అశోక్‌కుమార్, పీడీ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు

వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు ప్రచారం తగదు

వేమూరు: ఇది మంచి ప్రభుత్వం గ్రామసభల్లో తెలుగు దేశం నాయకులు వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అబ్బనగూడవల్లి గ్రామ సర్పంచ్ కొండి శెట్టి రాంబాబు శనివారం పేర్కొన్నారు. వేమూరు మండలంలోని అబ్బనగూడవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జగనన్న కాలనీలో పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన ఐదు మోటార్లు కనిపించకుండా పోయాయని, వాటిని తాను అమ్ముకున్నాడని ఆరోపించాడని, మండల స్థాయి అధికారులను లేదా జిల్లా స్థాయి అధికారులను తీసుకొని వచ్చి జగనన్న కాలనీలో పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన 5 మోటార్లను తనిఖీ చేయించుకోవాలని కొండిశెట్టి రాంబాబు సదరు తెలుగు దేశం నాయకుడికి సూచించారు. అబ్బనగూడవల్లి గ్రామానికి చెందిన ఎస్టీ కాలనీకి వరికూటి అశోక్‌బాబు గ్రావెల్ పంపించారని, దానిపై రూ.2 లక్షలు బిల్లులు పెట్టారని టీడీపీ నేత ఆరోపించాడని, అయితే తాము ఒక్క రూపాయి కూడా బిల్లు పెట్టలేదని జిల్లా పంచాయతీ అధికారి లేదా, డివిజనల్ పంచాయతీ అధికారి చేత బిల్లులు పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. అసలు అవినీతికి మూలమే టీడీపీ నాయకులను తెలిపారు. వారి అధికారంలోకి వచ్చీ రాకముందే అవినీతి తెరలేపారన్నారు. గ్రామంలోని చేపల చెరువు పంచాయతీ పరిధిలో ఉంటుందని, అయితే సదరు టీడీపీ నాయకుడు ఫిషర్‌మెన్ సొసైటీ నాయకుల వద్ద రూ.20 వేలు తీసుకొని పంచాయతీ నుంచి సొసైటీకి చెరువును మళ్లించాడని ఆరోపించారు.

'సైనేడ్' హంతకులపై మరో కేసు

తెనాలిరూరల్: బంగారం, నగదు, ఆస్తుల కోసం శీతల పానీయాలు, మద్యంలో సైనేడ్ కలిపి వరుస హత్యలు చేయడం ఇటీవలి కాలంలో కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. యడ్ల లింగయ్య కాలనీకి చెందిన వెంకటేశ్వరి, మునగప్ప రజినీ, రమణమ్మలు సైనేడ్‌తో పలువురిని హత్య చేసి ఇటీవల అరెస్టై రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. అదే యడ్ల లింగయ్య కాలనీకి చెందిన గుమ్మడి శ్రీనివాస్, తన తల్లి గుమ్మడి నాగమ్మ (65)ను వీరే హత్య చేశారని భావిస్తున్నట్టు శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. గతేడాది సెప్టెంబర్ 23న తన తల్లి మరణించగా సహజ మరణమని భావించామని, అయితే రమణమ్మ, వెంకటేశ్వరిలకు తన తల్లి రూ. 22 వేలు అప్పుగా గతంలో ఇచ్చిందని, వీరు చేసిన హత్యల గురించి ఇటీవల తెలుసుకోవడంతో అప్పు తీర్చకుండా తన తల్లిని హత్య చేసి ఉంటారని అనుమానంతో శ్రీనివాస్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎస్. రమేష్‌బాబు తెలిపారు.

ఎరువుల గోడౌన్ తనిఖీ

భట్టిప్రోలు: ఎరువుల దుకాణాలలో స్టాక్ రిజిస్టర్లకు అనుగుణంగా స్టాక్ ఉండాలని భట్టిప్రోలు మండల వ్యవసాయ శాఖాధికారి జి.మీరయ్య పేర్కొన్నారు. బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఆదేశానుసారం శనివారం భట్టిప్రోలులోని సోమశేఖర ఫర్టిలైజర్స్‌లో ఏఓ జి.మీరయ్య ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీరయ్య మాట్లాడుతూ ఎరువులు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని డీలర్లను ఆయన ఆదేశించారు.

చట్టంముందు అందరూ సమానులే

డీఎస్పీ రామాంజనేయులు

కర్లపాలెం: చట్టంముందు అందరూ సమానులేనని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. కర్లపాలెం ఎస్ఐ రవీంద్రతో కలసి డీఎస్పీ శుక్రవారం రాత్రి కర్లపాలెం మండల పరిధిలోని బోలాయపాలెం గ్రామంలో పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ అందరూ ఐకమత్యంగా గ్రామాభివృద్ధికి సహకరించాలని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాం

కొల్లూరు: కూటమి నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే తడవుగా ప్రజాపయోగకర కార్యక్రమాలు చేపట్టి ప్రజలలో మన మంచి ప్రభుత్వం అనిపించుకోగలిగామని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. శనివారం మండలంలోని క్రాపలో నిర్వహించిన మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, 100 రోజుల పాలనలో 100కు పైగా అభివృద్ధి పనులపై దృష్టి పెట్టిన ఏకైక ప్రభుత్వ కూటమి ప్రభుత్వమన్నారు. ఎంపీడీఓ ఐ.సత్యనారాయణ రావు, మాజీ ఎంపీపీలు కనగాల మధుసూదన్ ప్రసాద్, మైనేని మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి ఆరోపణలపై విచారణ జరిపించాలి

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): తిరుమల తిరుపతి వెంకటేశ్వరుని లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఆరోపణలపై విచారణ జరిపించాలని అర్చక సేవా సంఘం బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బృందావనం గోపీచంద్ తెలిపారు. మండల కేంద్రం పిట్టలవానిపాలెంలో శనివారం అర్చక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో అనంత చక్రవర్తి, పరిమిసాయి ఆమంచి దత్తాత్రేయశర్మ, విజయరామ్‌గోపాల్, సంతోష్ ఉన్నారు.

ఔషధ దుష్ఫలితాలపై అవగాహన



తెనాలి: ప్రజలందరూ తమ దైనందిన జీవితంలో ఏదొక ఔషధాలను తీసుకోవటం సహజమని, శరీరతత్వం, ఆహార, ఇతర అలవాట్ల ప్రభావంతో కొన్ని ఔషధాలు ప్రతికూల చర్యలను చూపుతాయని స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట రమణ అన్నారు. జాతీయ ఫార్మా-కో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఫార్మసీ కాలేజీ ఆధ్వర్యంలో పట్టణ చినరావూరులోని పాల్‌రాజ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ఔషధ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతికూల చర్యలు ఏర్పడినప్పుడు రోగులు ఎవరికి ఫిర్యాదు చేయాలనే అవగాహన చాలామందికి ఉండటం లేదన్నారు. ప్రతికూల చర్యలు లేని మందులు తీసుకోవటం ప్రతిఒక్కరి హక్కని, ఒకవేళ మందులు దుష్ఫలితాలను చూపినపుడు ప్రతి మండల, జిల్లా, రాష్ట్ర, దేశ, ప్రపంచ స్థాయిలో ఫిర్యాదులను స్వీకరించే కేంద్రాలు ఉన్నాయని చెప్పారు.